సాక్షి తిరుపతి

శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



దోచేయ్!

గూడూరు మండలంలో అధికార పార్టీ నేతలు చెలరేగిపోతున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. - 8లో



మద్యం దుకాణంపై రగడ

తమ కాలనీ పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ ఓజిలి మండలం, ఆర్మేనిపాడు వాసులు నిరసన తెలిపారు. - 8లో



డ్రైవర్ రహిత మెట్రో రైళ్లు

శ్రీసిటీలోని ఆల్‌స్టామ్ పరిశ్రమలో డ్రైవర్ రహిత మెట్రో రైళ్లు తయారు చేస్తూ మరో మైలురాయిని అధిగమించారు. - 8లో

న్యూస్‌రీల్

వైభవంగా పౌర్ణమి గరుడసేవ



తిరుమల: తిరుమలలో గురువారం రాత్రి పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడ వాహనాన్ని అధిరోహించి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

ఎంఏ, ఎమ్మెస్సీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఈనెల 21వ తేదీన ఎంఏ, ఎమ్మెస్సీ కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించబడనున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.సువర్ణలతా దేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీసెట్-2024 అర్హత సాధించి, ఇప్పటివరకు అడ్మిషన్ పొందని విద్యార్థినులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వాల్మీకికి ఘన నివాళి



కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో కలెక్టర్, జేసీ, డీఆర్వో

తిరుపతి అర్బన్: ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం కలెక్టరేట్‌లో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి చంద్రశేఖర్ నేతృత్వంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించగా.. ఎస్.వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్‌తోపాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ కృషి ఉంటే మనుషులు రుషులవుతారనడానికి మహనీయులు వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర ఓ నిదర్శనమని కొనియాడారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. డీఆర్వో పెంచలకిషోర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి పరిశ్రమపై చర్చ

తిరుపతి అర్బన్: శ్రీకాళహస్తి ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ పరిశ్రమకు సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ చర్చించారు. కలెక్టరేట్‌లో గురువారం జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్యతో కలసి ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలకు చెందిన తూర్పు గేట్ రహదారి వెడల్పు చేయాలని పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సురేష్ ఖండేల్వాల్ చెప్పారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ నుంచి ట్రీట్మెంట్ నీటి సరఫరా ధర అంశంపై తగుచర్యలు చేపట్టాలని కమిషనర్‌కు సూచించారు. తెలుగుగంగ నుంచి ఇండస్ట్రియల్ వాటర్ ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ ప్లాంట్‌నకు కేటాయింపు అంశంపై ఇరిగేషన్ జిల్లా అధికారి మదన్‌గోపాల్, వెంకటగిరి ఈఈ రాధాకృష్ణకు పలు ఆదేశాలిచ్చారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభం



సమావేశానికి హాజరైన అతిథులు, వీసీ

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో గురువారం మదన మోహన మాలవీయ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో 'అప్లికేషన్స్ ఆఫ్ ఐకేఎస్ఈన్ సాంస్క్రిట్ టెక్స్ట్ అండ్ ఇట్స్ కాంటెంపరరీ రిలవెన్స్' అనే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బెంగళూరుకు చెందిన పూర్ణప్రజ్ఞా సంస్కృత విద్యాపీఠం ప్రొఫెసర్ తిరుమల కులకర్ణి విచ్చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ జ్ఞానపరంపర, మహత్యం వంటి వాటిని అధ్యాపకులు ఆధునిక పద్ధతిలో బోధించాలని సూచించారు. వీసీ జీఎస్ఆర్.కృష్ణమూర్తి మాట్లాడుతూ టీచర్ ట్రైనింగ్ సెంటర్ వర్సిటీకి యూజీసీ ఇవ్వడం జరిగిందన్నారు. మాలవీయ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీధర్‌రావు, డాక్టర్ చారుకేష్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం కన్నూమిన్నూ కానకుండా ప్రవర్తిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై కక్ష సాధింపు చర్యలే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. విద్యార్థులు, పండుటాకులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న కంటి వైద్య పరీక్షలకు మంగళం పాడేసింది. ఇంటి ముంగిటే వైద్యం అందుతున్న ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలకు తాళం వేసి చేతులు పైకెత్తేసింది. వీటిపై ఆధారపడ్డ సిబ్బందిని నిర్దాక్షిణ్యంగా రోడ్డున పడేసింది. వీటిపైనే ఆధారపడి వైద్యం చేసుకుంటున్న నిరుపేద రోగులను ఆపసోపాలు గురిచేస్తోంది.



కంటికి కడివెడు కష్టాలు!

- కంటి వైద్య పరీక్షలకు కూటమి ప్రభుత్వం మంగళం
- ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలకు తాళం
- రోడ్డున పడ్డ సిబ్బంది
- అయోమయంలో పండుటాకులు

కాణిపాకం: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ఏడు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలు మూతపడ్డాయి. ముఖ్యంగా ఆప్తమాలజిస్టు, అసిస్టెంట్, ఎక్విప్మెంట్ అసిస్టెంట్లు ఉండేవారు. 60 ఏళ్లలోపు వారందరికీ శుక్లాలు, దృష్టిలోపం వంటి వివిధ కంటి వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించేవారు. షుగర్ వ్యాధి గ్రస్తులకు అతి ఖరీదైన

ఓపీ వివరాలు

సంవత్సరం	ఓపీ సంఖ్య
2021	21,456
2022	29,258
2023	31,589
2024	26,681

పండస్ రెటినో పరీక్షలను నిర్వహించి ఫలితాలను ఆయా ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల్లో తెలియజేసేవారు. ప్రస్తుతం వాటన్నింటికీ మంగళం పాడేశారు.

నాడు ఖరీదైన వైద్యం..నేడు పూజ్యం

ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో కేవలం ఓపీలో ఆధార్ కార్డుతో నమోదు చేసిన ఆధారంగా కంటి సమస్యలు ఉన్నవారికి ఐడీని క్రియేట్ చేసి ఉచితంగా కంటి పరీక్షలు చేపట్టేవారు. రూ.8 లక్షలకుపైగా విలువైన పరికరాలపై రెటీనా పరీక్షలు ఉచితంగా చేసేవారు. ఇదే మిషనరీ సేవలకు ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.4వేలు వరకు తీసుకునేవారు.

రోడ్డున పడ్డ కుటుంబాలు

ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల్లో నేత్ర పరీక్షలు, ఇతర సేవలు అందించేందుకు కేంద్రానికి ఇద్దరు చొప్పున్న సిబ్బందిని నియమించారు. 2017లోనే ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా వీరి నియమితులయ్యారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని ఏడు కేంద్రాల ద్వారా 14 మంది వరకు పనిచేస్తున్నారు.

ఈ–ఐ కేంద్రాలను టీడీపీ ప్రభుత్వం మూసివేయడంతో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఆప్తాల్మిక్ ఆఫీసర్లు, ఎక్విప్‌మెంట్ అసిస్టెంట్లు రోడ్డునపడ్డారు.

కంటి అద్దాల పంపిణీకి మంగళం

రేషన్ కార్డుతో అవసరం లేకుండా కేవలం ఆధార్ కార్డు ప్రాతిపదికన ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల్లో 60 ఏళ్లలోపు వారికి కంటి వైద్య పరీక్షలు చేయడంతో పాటు దృష్టి లోపం ఉన్న వారికి ఖరీదైన ఫైబర్ కళ్లద్దాలను అందజేసేవారు. ఆ వ్యక్తి రంగును ఎంచుకునే సౌకర్యంతో కంటి అద్దాలు, అద్దాలకు ఉండే ఫ్రేము పొందగలిగేవారు. ఉచిత పరీక్షలు ప్రభుత్వ సెలవు దినంలో తప్ప మిగిలిన అన్ని రోజుల్లో చేసేవారు. పాఠశాలల్లో చిన్నారులకు సైతం పరీక్షలు చేపట్టి వారికి ఉచిత కళ్లద్దాలను అందజేశారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారికి ఎన్‌జీవోల ఆధ్వర్యంలో ఉచితంగా నాణ్యమైన ఆపరేషన్లు చేయించేవారు. ముఖ్యంగా శుక్లాల ఆపరేషన్, టెరిజం(పొర) ఆపరేషన్లు ఉచితంగా రిమ్స్‌లో చేసేలా చర్యలు చేపట్టావారు. అలాగే ప్రభుత్వ నుంచి మల్టీ విటమిన్ ట్యాబ్లెట్లు, సిప్లాక్స్ చుక్కల మందు (ఐ–డ్రాప్స్)లు అందించేవారు. ఇప్పుడు ఈ సేవలన్నీ నిలిపేశారు.



కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

మూతబడిన సెంటర్లు



పి.కొత్తకోట సీహెచ్‌సీలోని ఈ–ఐ సెంటర్‌కు తాళం వేసిన దృశ్యం

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని పుంగనూరు, కొత్తకోట, పీలేరు, తంబళ్లపల్లి, చంద్రగిరి, సత్యవేడు, నారావారిపల్లి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రుల్లో ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాగానే ఈ సెంటర్లను మూసివేశారు.

ముసలోళ్లకు ఇబ్బంది నాయనా!



ఇన్నాళ్లూ ఈడా ఊరికే కంటి పరీక్ష చేస్తా ఉండేవారు. కంటి చూపు మందగించినోళ్లకు పరీక్షలు చేసి ఆపరేషన్ చేయించేవారు. కంటి అద్దాలు కూడా ఉచితంగా ఇచ్చేవాళ్లు. నెలకు ముందు నుంచి కంటి పరీక్ష చేసే గదికి తాళం వేసి ఉండారు. ఇదేమని ఈడుండేవాళ్లను అడిగితే కాంట్రాక్ట్ అయిపోయిందంటా.. అందుకే మూసేశారు..అంటుండారు. మా ముసుళ్లోలకు కంటి పరీక్షలు చేయడం అనుకూలంగా ఉండేది. ఎందుకు ఇలా చేసినారో అర్థం కావడం లేదు. ఈ సెంటర్‌ను తెరిపిస్తే బాగుండు.

– బాలిరెడ్డి, పోలవరం, పూతలపట్టు

శివ శివా..

ఇదే పాపం !

- ముక్కంటి ఆలయ పరిసరాల్లో అపచారం
- మాంసం పెట్టుకుని మద్యం సేవిస్తున్న సెక్యూరిటీ అధికారి
- సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్



సెక్యూరిటీ రూములో మద్యం సేవిస్తున్న సూపర్‌వైజర్

సాక్షి టాస్క్‌ఫోర్స్: శ్రీకాళహస్తీశ్వరాలయంలో పనిచేసే సెక్యూరిటీ అధికారే బహిరంగంగా ఆలయ పరిసరాల్లో కొద్ది రోజుల క్రితం మద్యం సేవిస్తున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వెలుగు చూశాయి. ముక్కంటి ఆలయంలో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పని చేసే శ్యామ్‌సుందర్ అనే వ్యక్తి ఈ మధ్య కాలంలో మాంసం పక్కన పెట్టుకుని మద్యం సేవిస్తున్న ఫొటోలు గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఆలయ రెండో గేటు వద్ద శివయ్య గోపురాన్ని ఆనుకుని సెక్యూరిటీ కార్యాలయం ఉంది. దాని పక్కనే సూపర్‌వైజర్ మాంసపు ముక్కలతో పాటు మద్యం సేవిస్తున్నాడు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వెలుగుచూశాయి. ఇవి చూసిన వారంతా పరమేశ్వరా నీ చెంతే ఇంత అపచారమా.. అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లో అపచారం చేసిన సెక్యూరిటీ సూపర్‌వైజర్ తనను ప్రశ్నించే సెక్యూరిటీ సిబ్బంది చాలామందిని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు అని ముద్ర వేసి ఇటీవల విధుల నుంచి తొలగించాడు. గతంలో ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తి శివలింగం పెడితే అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి రాజీనామా చేయాలంటూ నానా యాగీ చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తమ సొంత పార్టీ నాయకుల కనుసన్నల్లో నడుస్తున్న సెంట్రల్ సెక్యూరిటీ ఏజెన్సీకి చెందిన ఉద్యోగిపై ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. టీడీపీ నాయకులకు దోచుకోవడంపై ఉన్న శ్రద్ధ ఆలయ పవిత్రతను కాపాడడంపై లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.



శివయ్య గోపురం పక్కన ఉన్న సెక్యూరిటీ రూము

ఆయకట్టు.. అదే కనికట్టు?

గత అసెంబ్లీ ఎన్నికల్లో జిమ్మిక్కులు.. గిమ్మిక్కులు మరువక ముందే కూటమి ప్రభుత్వం గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికలకు తెరలేపింది. రైతుల భాగస్వామ్యం అటుంచి.. తమ పార్టీ నేతలకే చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు కట్టబెట్టాలని అధికారులపై ఒత్తిడి పెంచుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే కుయుక్తులు పన్నుతోంది. ఇతర పార్టీలకు చెందిన రైతులు ప్రశ్నిస్తే వారికి ఎలాగైనా సర్దిచెప్పేలా చూడాలని ఆదేశాలు జారీచేసినట్టు సర్వత్రా చర్చసాగుతోంది.



తెలుగుగంగ ప్రాజెక్టు (ఫైల్)

జిల్లాలో తెలుగుంగ ప్రాజెక్టు కమిటీలు

మండలం	ఎకరాలు	కమిటీలు	సభ్యులు
గూడూరు	3383.13	1	12
డక్కిలి, బాలాయపల్లి వెంకటగిరి, సైదాపురం ఓజిలి, నాయుడుపేట చిల్లకూరు, కోట	64776.6	36	378
పెళ్లకూరు,తొట్టంబేడు బీఎస్ కండ్రిగ, డీవీసత్రం నాయుడుపేట, వాకాడు చిట్టమూరు, సూళ్లూరుపేట	8373.09	7	66
తొట్టంబేడు, బీఎస్ కండ్రిగ సూళ్లూరుపేట	14930.72	16	148

సాగునీటి సంఘాలకు ఎల్లుండే నోటిఫికేషన్

- పదేళ్ల తర్వాత మళ్లీ ఎన్నికలకు సిద్ధం
- జిల్లాలో 692 సంఘాలు
- నవంబర్ 16 నుంచి ఎన్నికలు
- ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్న రెవెన్యూశాఖ

తిరుపతి అర్బన్: సాగునీటి సంఘాల ఎన్నికలకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ ఎన్నికలకు రంగం సిద్ధం చేసింది. ఈనెల 19న నోటిఫికేషన్ విడుదల చేసి, నవంబర్ 16 నుంచి 22వ తేదీలోపు ఎన్నికలు పూర్తయ్యేలా షెడ్యూల్ విడుదల చేయనుంది. ఈ మేరకు రైతు ఓటర్లు, ఏర్పాట్లలో అధికారులు తలమునకలయ్యారు. తిరుపతి జిల్లాలో ప్రధాన సాగునీటి వనరు తెలుగుగంగ ప్రాజెక్టు కాగా.. ఈ ప్రాజెక్టు కింద గూడూరు, డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి, సైదాపురం, ఓజిలి, నాయుడుపేట, చిల్లకూరు, కోట, పెళ్లకూరు, తొట్టంబేడు, బీఎస్‌కండ్రిగ, డీవీ సత్రం, నాయుడుపేట, వాకాడు, చిట్టమూరు, సూళ్లూరుపేట, తొట్టంబేడు మండాల పరిధిలో 91463.54 ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికి సంబంధించి 60 సాగునీటి సంఘాలను ఎంపిక చేయాల్సి ఉంది. అందులో 604 మంది సభ్యులకు అవకాశం ఉంటుంది. మరోవైపు జిల్లా వ్యాప్తంగా చెరువులకు సంబంధించి తిరుపతి అర్బన్ మండలం మినహా మిగిలిన 33 మండాల్లో 621 చెరువులకు సాగునీటి సంఘాలు, పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టు పరిధిలో 5 కమిటీలు, తొట్టంబేడు మండంలోని స్వర్ణముఖి పరిధిలో 6 సాగునీటి కమిటీలను ఎంపిక చేయనున్నారు. మొత్తంగా చెరువులు, నదులు, ప్రాజెక్టుల పరిధిలో జిల్లాలో 692 కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

అప్పుడే పచ్చ రాజకీయం!

జిల్లాలోని సాగునీటి సంఘాలకు టీడీపీ కూటమి నేతలే ఉండేలా ఏకభిప్రాయంతోనే సాగునీటి ఎన్నికలు జరిపించాలని ఇప్పటికే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు టీడీపీ పెద్దల నుంచి ఆదేశాలు అందినట్టు సమాచారం. ఇతర పార్టీల నేతలు ప్రశ్నిస్తే చెరువుల అభివృద్ధికి అధికార పార్టీ నేతలు ఉంటేనే బాగుంటుందని నచ్చజెప్పాలని సూచించినట్టు చర్చ జరుగుతోంది. ఎన్నికలు పూర్తయిన తర్వాత కరకట్టలు, కలుజులు, తూములతోపాటు వరద కాలువలకు లక్షల్లో టెండర్లు ఆహ్వానించి కట్టబెట్టే ప్రయత్నం ఇప్పటి నుంచే మొదలైనట్టు పలువురు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

22న ఎన్నికల ముగింపు

సాగునీటి ఎన్నికలకు సంబంధించి శనివారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఆ తర్వాత నవంబర్ 10వ తేదీలోపు ఓటర్ల జాబితా రూపొందించడం, అభ్యంతరాలుంటే సరిచేయడం చేస్తారు. నవంబర్ 14న కలెక్టర్ నేతృత్వంలో వివిధ పార్టీలు, రైతు సంఘాల నేతలతో సమావేశం, 15న తుది ఓటర్ల జాబితా ప్రచురణ, 16 నుంచి దశల వారీగా ఎన్నికలు మొదలవుతాయి. నవంబర్ 22తో ఎన్నికలు ముగియనున్నాయి. ముందుగా చెరువుల కమిటీలకు సంబంధించి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. తర్వాత తెలుగు గంగ ప్రాజెక్టు కమిటీల ఎన్నికలను నిర్వహించనున్నారు. నిర్వహిస్తారు.

శ్రీకాళహస్తిలోనే ఎక్కువ

సాగునీటి సంఘాల విషయానికొస్తే శ్రీకాళహస్తి మండలంలోనే ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మండలంలో దాదాపు 70 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇక తొట్టంబేడు -28, ఏర్పేడు-35, రేణిగుంట-11, బీఎస్ కండ్రిగ-12, సత్యవేడు-13, వరదయ్యపాళెం-31, ఓజిలి-22, నాయుడుపేట -29, పెళ్లకూరు-15, డీవీ సత్రం-36, సూళ్లూరుపేట-20, తడ-16, గూడూరు-14, చిల్లకూరు-22, కోట-20, వాకాడు-19, చిట్టమూరు-30, బాలాయపల్లి-22, వెంకటగిరి-30, డక్కిలి-18, పాకాల- 09, తిరుపతి రూరల్-03, చంద్రగిరి-10, చిన్నగొట్టిగల్లు-03, ఎర్రావారుపాళెం- 03, రామచంద్రాపురం-10, పుత్తూరు-07, వడమాలపేట-11, కేవీబీ పురం-26, నాగలాపురం-11, నారాయణవనం-06, పిచ్చాటూరు-09, పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు-05, తొట్టంబేడులోని స్వర్ణముఖి-06తో కలిపి మొత్తం 632 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే

రెండు రోజుల్లో నోటిఫికేషన్ రానుంది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తాం. 632 చెరువులకు ఆయకట్టు ఎన్నికలతోపాటు, 60 తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలోని సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నాం. ఎన్నికలు పారదర్శకంగానే ఉంటాయి.

–మదన్‌గోపాల్, ఇరిగేషన్ జిల్లా అధికారి

నిండిన తొండమనాడు చెరువు

- 14 గ్రామాల రైతులకు ఉపయోగం
- పరిశీలించిన కలెక్టర్



చెరువును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి రూరల్: వర్షాల నేపథ్యంలో మండలం పరిధిలోని తొండమనాడు చెరువును గురువారం కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలిసి ఇరిగేషన్ ఎస్ఈ మదన్‌గోపాల్, ఈఈ రాధాకృష్ణ, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి పరిశీలించారు. చెరువు పూర్తి స్థాయిలో నిండడం ద్వారా 4,386 ఎకరాల ఆయకట్టు సాగులోకి రానుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి, ఏర్పేడులో 8 నుంచి 9 సెం.మీ వర్షం పడిందని చెప్పారు. గతంలో తొండమనాడు చెరువులో 0.1టీఎంసీల నీరు నిల్వ ఉండేదని, అయితే ఇప్పుడు అది 0.5టీఎంసీలకు పెరిగి కలుజు కూడా పారుతోందని చెప్పారు. దీనిద్వారా 14 గ్రామాల రైతులు సాగుకు ఇబ్బందులు తప్పాయన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో 350కిపైగా ఇళ్లలో నీరు చేరిందని, వారిని పునరావాస కేంద్రాలకు తరలించినట్టు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ పఠాన్‌రఫీకాన్ ఇతర అధికారులు ఉన్నారు.

స్విమ్స్‌లో పలు పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి తుడా: స్విమ్స్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, ఎమ్మెస్సీ బయోఇన్ఫర్మేటిక్స్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పీజీ సెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 19 నుంచి 21వ తేదీలోపు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు స్విమ్స్ అధికారిక వెబ్‌సైట్‌ను చూడాలని కోరారు.

క్లుప్తంగా

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ ఏవీ రమణ

వెంకటగిరి రూరల్: స్థానికంగా గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సీఐ ఏవీ రమణ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటగిరికి చెందిన షేక్ రహంతుల్లాబాషా ఆటో నడుపుకుంటూ జీవించేవాడని, ఈ క్రమంలో ఈజీ మనీ కోసం నెల్లూరు నుంచి గంజాయిని దిగుమతి చేసుకుని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.300 నుంచి రూ.400 వరకు విక్రయించేవాడని తెలిపారు. అతనిపై నిఘా ఉంచి దాడులు చేసి పట్టుకున్నట్టు వెల్లడించారు. అతని వద్ద రూ.120 గ్రాముల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు రహంతుల్లా బాషాపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. సీఐ వెంట ఎస్‌ఐ సుబ్బారావు ఉన్నారు.

వానొచ్చినా..

వరదొచ్చినా దోచేయ్!

- కైవల్యాను తోడేస్తున్న అక్రమార్కులు
- కన్నెత్తి చూడని అధికారులు
- విస్మయం వ్యక్తం చేస్తున్న స్థానికులు



గొల్లపల్లి వద్ద యంత్రాల సాయంతో కైవల్యా నదిలో ఇసుకను తోడుతున్న అధికార పార్టీ నేతలు

చిల్లకూరు: 'వానొచ్చినా.. వరదొచ్చినా మాకేంటి.. డబ్బు సంపాదనే ముఖ్యం. పోలీసులు ఎదురుపడితే రూ.వెయ్యి ఇస్తాం. నెలమామూళ్లు స్టేషన్లకు పంపిస్తాం. ఎవరైనా అడ్డుపడితే వాడి అంతు చూస్తాం' అంటున్నారు.. గూడూరు మండలంలోని ఇసుకాసురులు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఎక్కడ ఇసుక కనిపిస్తే అక్కడ వాలిపోతున్నారు. యంత్రాలు పెట్టి అందినకాడికి తవ్వేస్తూ జేబులు నింపుకుంటున్నారు. గూడూరు మండలంలోని గొల్లపల్లిలో ప్రాంతానికి చెందిన అధికార పార్టీ నాయకులు రాత్రి, పగలు తేడాలేకుండా పక్కనే ఉన్న కైవల్య నదిలో యంత్రాలు పెట్టి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. వరదలొచ్చినా.. వానలొచ్చినా ఆపేదేలేదు..అంటూ తెగేసి చెబుతున్నారు. రోజుకు సుమారు 20 ట్రాక్టర్లకు తక్కువ లేకుండా ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక ట్రాక్టర ఇసుక రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రయిస్తున్నారు. అందులో గూడూరుకు చెందిన అధికార పార్టీ నాయకుడికి ఒక ట్రాక్టర్‌కు రూ.వెయ్యి ముట్టజెప్పాలని ట్రాక్టర్ల యజమానులు చెబుతున్నారు. ఇక పోలీసులకు నెల మామూళ్లతో పాటు ట్రాక్టర్ ఎదురు పడితే అప్పటికప్పుడు రూ.వెయ్యి వరకు ముట్టజెప్పాలని అంటున్నారు. దీనికారణంగానే ఇసుక రేటు పెరిగిందని అంటున్నారు. రాత్రి పూట సైదాపురం నుంచి వచ్చే మార్గంలో ఇసుకను తవ్వి పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో తరలిస్తున్నా పోలీసులు అటు వైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. గొల్లపల్లి ప్రాంతంలో ఇసుక తవ్వే విషయంగా.. ఇటీవల అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు, సైదాపురం ప్రాంతానికి చెందిన నాయకుల మధ్య వివాదం రేగింది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకుని సైదాపురం పోలీస్ స్టేషన్లో కేసులు కూడా నమోదు చేసుకున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు ఈ 'అధికార' దందాపై ఓ కన్నేయాల్సి ఉంది.

చవటపల్లిలో భూమి నుంచి వింత శబ్దాలు



శబ్దాలు వస్తున్న రంధ్రం ఇదే

కలువాయి: మండలంలోని చవటపల్లికి చెందిన రైతు బాబు పొలంలో చిన్న రంధ్రం ఏర్పడి అందులో నుంచి వింత శబ్దాలు వస్తున్నాయని స్థానికులు తెలిపారు. అందులో పాములు ఏమైనా ఉన్నాయేమోనని మంట పెట్టి చూసినా శబ్దాలు మాత్రం ఆగలేదన్నారు. ఇటీవల వర్షాలకు పొలంలో రంధ్రం ఏర్పడిందని, దాని నుంచి శబ్దాలు వస్తున్న వెల్లడించారు. కానీ దీనిపై ఎవరికీ ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

పొట్ట కూటి కోసం వచ్చి..

ప్రాణాలు పోగొట్టుకుని..!

– గుండె పోటుతో తమిళనాడు లారీ డ్రైవర్ మృతి



మృతి చెందిన లారీ డ్రైవర్ అన్నాదొరై

తడ: లోడ్డు కోసం తమిళనాడు నుంచి ఆంధ్రాకి వచ్చిన లారీ డ్రైవర్ అనూహ్య పరిస్థితుల్లో సాయం అందించే వారు లేక ప్రాణాలు వదిలిన ఘటన తడలో చోటుచేసుకుంది. తడ ఎస్‌ఐ కొండపనాయుడుకి అందిన ఫిర్యాదు మేరకు.. తమిళనాడులోని తిరుచురాపల్లికి చెందిన కర్నన్ అన్నాదొరై(37) లారీ డ్రైవర్. ఈ నెల 14వ తేదీన చెన్నై నుంచి శ్రీసిటీకి లారీలో లోడ్డు తీసుకువచ్చాడు. అన్‌లోడింగ్ అనంతరం మరో లోడ్డు తీసుకుని చెన్నై వెళ్లాల్సి ఉండగా లోడింగ్ ఆలస్యం కావడంతో లారీని తడ పరిధిలోని నిప్పో పరిశ్రమ ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో నిలిపి విశ్రాంతి తీసుకున్నాడు. 15వ తేదీ వరకు ఫోన్‌లో స్పందించిన భర్త 16 తేదీ నుంచి ఫోను తియ్యక పోవడంతో భార్య విజయలక్ష్మి ఆందోళనకు గురయ్యారు. కుటుంబ సభ్యులతో కలిసి భర్తను వెతుక్కుంటూ తడకు చేరుకుని, బుధవారం రాత్రి భర్త నడిపే లారీని కనిపెట్టారు. లారీ డోర్లు తెరుచోకోక పోవడంతో స్థానికులతో కలసి డోరు పగులగొట్టి చూడగా భర్త విగత జీవిగా పడి ఉండడంతో బోరుమన్నారు. దీనిపై బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. గురువారం మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాత్రి సమయంలో గుండెపోటు రావడం, సమయానికి సమీపంలో ఎవరూ లేకపోవడంతో అన్నాదొరై మృతి చెందినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతుని భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

– మరొకరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఢిల్లీ

తడ: జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు. ఎస్‌ఐ కొండపనాయుడు తెలిపిన వివరాల మేరకు.. సత్యవేడు మండలం, కొల్లడం గ్రామానికి చెందిన ఢిల్లీ(59) ఆరంబాకంలో ఉంటూ సంఘ సేవ చేసేవాడు. గురువారం తడకు చెందిన భువన్‌లాల్‌తో కలిసి ఆయన బైక్‌పై సూళ్లూరుపేటకు బయలుదేరారు. అదే సమయంలో చెన్నై నుంచి సూళ్లూరుపేట వైపు వెళుతున్న కారు బీఎల్‌పాడు గ్రామం మలుపు వద్ద వీరి బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చుని ఉన్న ఢిల్లీ ఘటనా స్థలంలోనే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడ్డ భువన్‌లాల్‌ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నై తీసుకెళ్లారు. కారు డ్రైవర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

గూడూరు రూరల్: గుర్తుతెలియని వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన గూడూరు– కొండాగుంట రైల్వే లైన్‌లో గురువారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. రైల్వే గ్యాంగ్‌మన్ కొండాగుంట ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో రైల్వే ట్రాక్‌పై ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు గుర్తించి సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లి చూడగా సుమారు 35 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి రైల్వే ట్రాక్ పక్కన పడి మృతి చెంది ఉన్నాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం, కుందేటివారి వీధిలో ఓ మహిళ మెడలో చైన్ లాక్కెళ్లిన చైన్‌స్నాచర్లను శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు కథనం.. తమిళనాడు రాష్ట్రం, సేలం జిల్లాకు చెందిన శశికుమార్(23), సురేష్‌ను ఆర్టీసీ బస్టాండు వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.50 వేల విలువ చేసే బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

తిరుమలలో ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ

– టీటీడీ అదనపు ఈఓ సీహెచ్.వెంకయ్యచౌదరి

తిరుమల: తిరుమలలో పెరిగిపోతున్న వాహనాల రద్దీని నియంత్రించేందుకు అత్యవసరంగా ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను టీటీడీ అడిషనల్ ఈఓ సీహెచ్.వెంకయ్య చౌదరి ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో గురువారం టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి టీటీడీ, విజిలెన్స్ పోలీసులు, ఆర్టీఏ, టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. తిరుమల ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై స్వల్ప కాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఈఓ మాట్లాడుతూ తిరుమలలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. టీటీడీ, విజిలెన్స్ పోలీసులు, ఆర్టీఏ, టౌన్ ప్లానింగ్, ఏపీఎస్ ఆర్టీసీ, టీటీడీ ఇంజినీరింగ్, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్ జీఎంలు కమిటీగా ఏర్పడి వారం రోజుల్లోపు సమస్యలను గుర్తించి పరిష్కారానికి సలహాలు, సూచనలు అందివ్వాలన్నారు.

కొండపై ప్రైవేటు ట్యాక్సీస్టాండ్ల పేరుతో దందా

తిరుమల: తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేటు ట్యాక్సీ స్టాండ్ ఏర్పాటుచేసి భారీగా నగదు వసూలు చేస్తున్నారు. దీనిపై ఓ డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. తిరుపతికి చెందిన మురళీకృష్ణ నాయుడు తిరుమలలోని ముళ్లగుంట పార్కింగ్ స్టాండ్లో ట్యాక్సీని ఉంచేందుకు స్టాండ్ యూనియన్ నాయకుడిని కలిశాడు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు స్టాండ్లో వాహనం ఉంచాలంటే రూ.10,500 చెల్లించాలని తెలిపాడు. దీంతో ట్యాక్సీడ్రైవర్ ఎస్పీ ఎల్.సుబ్బరాయుడుకు ఫిర్యాదు చేశనట్టు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన ఈ స్టాండ్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడు పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడిపై గురువారం రాత్రి కొందరు ట్యాక్సీ స్టాండ్ నాయకులు దాడికి పాల్పడ్డారు. దీనిపై బాధితుడు తనను రక్షించాలని పోలీసులకు ఓ వీడియో ద్వారా విజ్ఞప్తి చేశారు. పోలీసులు వెంటనే తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని విన్నవించాడు. దీనిపై తిరుమల టూటౌన్ పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

మద్యం దుకాణం ఏర్పాటుపై నిరసన



మద్యం దుకాణం ఏర్పాటును అడ్డుకున్న మహిళలు

ఓజిలి: తమ కాలనీ పక్కనే మద్యం దుకాణం ఏర్పా టు చేయవద్దంటూ మహిళలు నిరసన తెలిపారు. ఈ సంఘటన మండలంలోని ఆర్మేనిపాడు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. కాలనీలో షాపు ఉంటే ఇబ్బందులు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం తొమ్మిది గంటలకే మద్యం షాపు తెరవడంపై మహిళలు అడ్డుకుని మూసివేశారు. అనంతరం మద్యం షాపు నిర్వాకులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఓజిలి ఏఎస్‌ఐ రాధమ్మ, హెడ్‌కానిస్టేబుళ్లు పెంచలయ్య, రమేష్ ఇరువర్గాలకు సర్దిచెప్పారు. అనంతరం నాయుడుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ అరుణకుమారి షాపు వద్దకు చేరుకుని మహిళలతో మాట్లాడారు. ఆమె సూచనలతో షాపు యజమానులు దుకాణం తెరిచి మద్యం విక్రయించారు.

శ్రీసిటీ ఆల్‌స్ట్రామ్ పరిశ్రమలో

డ్రైవర్ రహిత మెట్రో రైళ్ల తయారీ



ఢిల్లీ మెట్రోకు పంపిన రైలు



చెన్నై మెట్రో అధికారులకు లాంఛనంగా రైళ్లను అందించిన ఆల్‌స్ట్రామ్ ప్రతినిధులు

- ఢిల్లీ, చెన్నై మెట్రోలకు సరఫరా

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలోని ఆల్‌స్ట్రామ్ పరిశ్రమలో డ్రైవర్ రహిత మెట్రో రైళ్లు తయారు చేస్తూ మరో మైలురాయిని ఆ పరిశ్రమ అధిగమించింది. ఈ పరిశ్రమ నుంచి ఢిల్లీ, చెన్నై మెట్రోలకు అత్యాధునిక డ్రైవర్ రహిత మెట్రో రైళ్లను సరఫరా చేస్తున్నారు. 100 శాతం స్వదేశీ పరికరాలు, పరిజ్ఞానంతో ఉత్పత్తవుతున్న ఈ రైళ్లు మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాలకు దక్కిన విజయంగా పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఆ దిశగా పరిశ్రమ ప్రతినిధులు తెలిపిన సమాచారం మేరకు ఢిల్లీ మెట్రో నాల్గో దశ విస్తరణ ప్రాజెక్టు కోసం రూ.2,800 కోట్ల ఒప్పందంలో భాగంగా మొదటి విడతగా 52 డ్రైవర్ రహిత మెట్రో పాలిస్ రైళ్ల సెట్లను ఈ ఏడాది సెప్టెంబర్ 23న ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు అందజేసింది. అలాగే చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ రెండో దశ విస్తరణ ప్రాజెక్టు కోసం 32 డ్రైవర్‌లెస్ రైళ్ల సెట్లను సరఫరా చేస్తోంది. రూ.1,215 కోట్ల ఒప్పందం మేరకు ఈ సరఫరా జరుగుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఇది పర్యావరణ అనుకూల పట్టణ రవాణాలో కొత్త శకానికి నాందిగా డీఎంఆర్‌సీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వికాస్ కుమార్ తెలిపారు.

విష జ్వరంతో వ్యక్తి మృతి



మృతి చెందిన ప్రసాద్ (ఫైల్)

బాలాయపల్లి (సైదాపురం): విష విజ్వరంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన బాలాయపల్లి మండలం, వెంకటరెడ్డిపల్లి గ్రామంలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు.. వెంకటరెడ్డిపల్లికి చెందిన వల్లెపు ప్రసాద్ (35) ఈనెల 13న అనారోగ్యానికి గురయ్యారు. ఈ మేరకు స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ వైద్యుడ్ని సంప్రదించగా.. మరుసటి రోజుకి ప్రసాద్ ఆరోగ్యం క్షీణించింది. ఆపై మెరుగైన వైద్యం కోసం గూడూరులోని ఓ ప్రయివేటు వైద్యశాలలో చేరించారు. ఆ తర్వాత విధిలేని పరిస్థితుల్లో గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ప్రసాద్ మృతిచెందాడు. మృతునికి భార్యతోపాటు 8, 9 తరగతులు చదువుతున్న కుమార్తె, కుమారుడు ఉన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న వీసీ రమణ

తిరుపతి సిటీ: యువత పారిశ్రామికవేత్తలుగా రాణించి, ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ జేవీ రమణ పిలుపునిచ్చారు. గురువారం వర్సిటీలోని నిరంతర విద్య, సమాచార విభాగం ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతుల్లో పందుల పెంపకం అనే అంశంపై జరిగిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పందులను శాస్త్రీయ పద్ధతుల్లో పెంచడంతో దాణా ఖర్చు పెద్ద ఎత్తున తగ్గించవచ్చునన్నారు. దీంతో లాభార్జన పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శోభారాణి, డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, డాక్టర్ సీహెచ్ శ్రీలత, కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.సుజాత, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

ప్రత్యేక రాయితీతో మమోగ్రామ్ పరీక్షలు

తిరుపతి తుడా: స్విమ్స్ ఆసుపత్రి ఆంకాలజీ, రేడియాలజీ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాల ఆధ్వర్యంలో ప్రత్యేక రాయితీతో మమోగ్రామ్ పరీక్షలు నిర్వహించనున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా వైద్యుల పర్యవేక్షణలో ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా ఈ నెల 21 నుంచి 31వ తేది వరకు స్విమ్స్ క్లినిక్‌లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. 40ఏళ్లు వయస్సు పైబడిన మహిళల కోసం రొమ్ము క్యాన్సర్ అవగాహన క్యాంపెయిన్ నిర్వహిస్తామని తెలియజేశారు. మమోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలనుకునే మహిళలు స్విమ్స్ క్లినిక్‌లో సంప్రదించి రూ.1000 ప్రత్యేక రాయితీతో పరీక్షలు నిర్వహించుకుని, డాక్టర్‌ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 83339 97968 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ విస్తృత పర్యటన



కందాదలో గోడకూలిన పూరింటిని పరిశీలిస్తున్న కలెక్టర్

ఏర్పేడు: ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ వెంకటేశ్వర్ విస్తృతంగా పర్యటించారు. ముందుగా మండలంలోని కందాదు పంచాయతీ పరిధి, చిన్నప్పగుంట ఎస్టీ కాలనీలో తుపాన్ ప్రభావంతో పూరిళ్లు, మట్టి మిద్దెలు కూలిపోయిన బాధితులను ఆయన పరామర్శించారు. తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కలెక్టర్‌ను కోరగా జేజేఎం కింద నిర్మించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రానికి రన్నింగ్ వాటర్ కోసం విన్నవించగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చిన్నప్పగుంట ఎస్టీ కాలనీలో గంగమ్మ, చంద్రమ్మ, చెంచమ్మ పూరిళ్లు, మట్టి మిద్దెలు వర్షానికి నేలకొరిగాయని చెప్పారు. వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారంతో పాటు ఇళ్ల పట్టాలు అందజేసి పక్కా గృహాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీపావళి నాటికి నూతన ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. తహసీల్దారు భార్గవి, ఎంపీడీఓ సౌభాగ్యం, హౌసింగ్ ఏఈ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

చిన్నన్నపేటలో కాజ్‌వే పరిశీలన

సైదాపురం(వెంకటగిరి): వెంకటగిరి రూరల్ మండలంలోని చిన్నన్నపేట గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న కాజ్‌వేను కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎడతెరిపిలేని వర్షాలకు దెబ్బతిన్న కాజ్‌వేలను సకాలంలో మరమ్మతులు చేస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంట నష్టపరిహారం కూడా అందజేస్తామని చెప్పారు. ఆయన వెంట గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీన, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీఓ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఇళ్లున్నా.. అనుభవ పత్రాలు లేవయ్యా!



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సైదాపురం (వెంకటగిరి): 'కలెక్టరయ్యా.. మేము ఆరుగాలం కష్టపడి కట్టుకున్న ఇళ్లకు రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వడంలేదు. కాళ్లావేళ్లా పడుతున్నా కనికరించడం లేదు' అంటూ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఎదుట మండలంలోని చిన్నన్నపేట గ్రామస్తులు తమ ఆవేదన వెళ్లగక్కారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా గ్రామంలో ఇళ్లు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నామని, తాము నివాసముంటున్న ఇళ్లకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. కలెక్టర్ స్పందిస్తూ సమస్య పరిష్కరించాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనను ఆదేశించారు.